విరాళం అందజేస్తున్న బాలయ్య కుటుంబ సభ్యులు

సిద్ధరామేశ్వర ఆలయనికి విరాళం

భిక్కనూరు, డిసెంబర్ 10 : మండలంకేంద్రంలోని సిద్ధరామేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి స్థానిక భక్తుడు బొందుగుల బాలయ్య కుటుంబసభ్యులు అదివారం రూ. 51 వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా వారికి అలయ అర్చకులు తీర్థ ప్రసాదాలతోపాటు స్వామి వారి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి, అర్చకుడు సిద్ధగిరి శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

బీబీపేట్, డిసెంబర్ 10: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో 6వ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 6 గంటలకు గణపతి హోమం, 8 గంటలకు అష్టాభిషేకం, 10 గంటలకు ఉపదేవకలశం, 11 గంటలకు కలశాభిషేకము, మధ్యాహ్నం 12 గంటలకు ప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు దీపారాధన, 6:30 గంటలకు ఊరేగింపు, 8:30 గంటలకు శ్రీబలి, 9 గంటలకు ఉత్తర పూజ, 9:30 గంటలకు భజన 10:30 గంటలకు శ్రీబలి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సంఘం ప్రతినిధులు, సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో పూజలు

అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

నస్రుల్లాబాద్, డిసెంబర్ 10 : మండలంలోని మైలారం గ్రామ శివారులో ఉన్న మైసమ్మ ఆలయాన్ని భక్తులు ఆదివారం పెద్ద సంఖ్యలో దర్శించుకొని పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వన భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు.

చుక్కాపూర్‌లో భక్తుల సందడి

మాచారెడ్డి, డిసెంబర్ 10 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జిల్లా నలుమూలలతోపాటు ఇతర జిల్లాల నుంచి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ఒడిబియ్యం, పట్టెనామాలు, కోరెమీసాలు, కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ శనిగరం కమలాకర్‌రెడ్డి, ఈవో శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పరాంధామచార్యులు, నర్సింహాచార్యులు, సంజీవాచార్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

మాచారెడ్డి, డిసెంబర్ 10 : మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలో ప్రయాణికులకు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ ట్రాఫిక్ రూల్స్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలను పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, ఫోర్ వీలర్స్ నడిపేవారు సీట్‌బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ, ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని

సద్వినియోగం చేసుకోవాలి

■ కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

దోమకొండ, డిసెంబర్ 10: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమాణారెడ్డి సూచించారు. దోమకొండ ప్రభుత్వ దవాఖానలో ఆరోగ్యశ్రీ, ఆర్టీసీ బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా పథకాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10లక్షలకు పెంచడంతో పేదల ఆరోగ్యానికి భరోసా కలుగుతుందని అన్నారు. మహిళలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించడం హర్షణీయమని అన్నారు. నియోజకవర్గ ప్రజల తరపున సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమకొండ ప్రభుత్వ దవాఖానలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

బాన్సువాడ ఎంసీహెచ్‌లో ఆరోగ్యశ్రీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో భుజంగరావు, వైద్యాధికారులు

బాన్సువాడలో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆరోగ్యశ్రీతో పేదలకు మేలు : బాన్సువాడ ఆర్డీవో

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 10 : రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెచడంతో పేదలకు మరింత మేలు చేకూరుతుందని బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు అన్నారు. పట్టణంలోని మాతాశిశు దవాఖానలో ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోగులు దవాఖానలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష, ప్రభుత్వ దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుధ, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణం హర్షణీయం

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం హర్షణీయమని ప్రభుత్వ దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుధ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకాన్ని ఆర్డీవో భుజంగరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు రాష్ట్ర పరిధిలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీని కలిసిన కామారెడ్డి ఎమ్మెల్యే

కామారెడ్డి, డిసెంబర్ 10 : కామారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన కాటిపల్లి వెంకటరమణారెడ్డిని ఆదివారం ఎస్సీ సింధూశర్మను మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఎస్సీ అభినందనలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో శాంతిభద్రతలు తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మోటూరి శ్రీకాంత్, నాయకులు శ్రీను, భరత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సింధూశర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటరమణారెడ్డి

14న మెగా రక్తదాన శిబిరం

కామారెడ్డి, డిసెంబర్ 10: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఈ నెల 14న పట్టణంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో మెగా రక్తదానం శిబిరం నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయ కర్త బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహం అధ్యక్షుడు డాక్టర్ వేదప్రకాశ్ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా యువత మానవతా దృక్పథంతో స్పందించి పెద్ద ఎత్తున రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. రక్తదానం చేసేవారు 9492874006 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మెరుగైన వైద్యం అందించేందుకే బస్తీ దవాఖానలు

బస్తీ దవాఖానలో వివరాలను తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శిరీష

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 10 : పట్టణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికే ప్రభుత్వం బస్తీ దవాఖానలను ఏర్పాటు చేసిందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష తెలిపారు. పట్టణంలోని బస్తీ దవాఖానలను ఇన్‌చార్జి డాక్టర్ అశ్విన్‌తో కలిసి ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానలకు వస్తున్న రోగులు, వైద్య సేవలు, స్టాక్ వివరాలను పరిశీలించారు. రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని, సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటే ఏరియా దవాఖానలకు రిఫర్ చేయాలని సూచించారు.

వాహనాల తనిఖీ

బీబీపేట్/రాజంపేట్, డిసెంబర్ 10 : మండలకేంద్రంలోని జనగామ రోడ్డులో ఏఎస్సై ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువ పత్రాలు లేని 30 మంది వాహనదారులకు జరిమానా విధించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని ఏఎస్సై సూచించారు. తనిఖీల్లో సిబ్బంది రాములు, ప్రవీణ్, రవీందర్ పాల్గొన్నారు. రాజంపేట్ మండలకేంద్రంలోని శివారులో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు.

ఉపాధిహామీ గ్రామసభ

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 10 : మండలంలోని బోర్లం గ్రామంలో ఆదివారం ఉపాధిహామీ సామాజిక తనిఖీపై సర్పంచ్ సరళ అధ్యక్షతన గ్రామసభను ఏర్పాటు చేశారు. 2022 ఏప్రిల్ 1 నుంచి మార్చి 2023 వరకు గ్రామంలో చేపట్టిన రూ.23లక్షల ఉపాధిహామీ పనులపై మూడు రోజులుగా ఆడిట్ నిర్వహించారు. ఆడిట్ వివరాలను గ్రామసభలో వెల్లడించారు. డీఆర్పీ రుచిత, జీపీ కార్యదర్శి సాయికుమార్, జూనియర్ అసిస్టెంట్ అశోక్, ఉపాధిహామీ కూలీలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గ్రామసభలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు 894 మంది హాజరు

కామారెడ్డి, డిసెంబర్ 10 : జిల్లాలో ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కామారెడ్డి డివిజన్లో 3, బాన్సువాడ డివిజన్‌లో ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయగా 894 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో రాజు తెలిపారు. మొత్తం 916 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 22 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.